ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతం


బేస్తవారిపేట జెడ్పీ హైస్కూల్లో ప్రమాణస్వీకారం చేయిస్తున్న హెచ్ఎం


కొమరోలు: ఎస్ఎంసీ ఎన్నికలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ వెంకటరత్నం


కొండేపల్లి విద్యాకమిటీ చైర్మన్‌ను , అభినందిస్తున్న కుందురు పెద్దవెంకటరెడ్డి

- కొనకనమిట్ల, తర్లుపాడులోని పలు పాఠశాలల్లో స్వల్ప వివాదం
- మార్కాపురం నియోజకవర్గంలో మొత్తం పాఠశాలలు 289
- ఎన్నికలు పూర్తయినవి 276 పాఠశాలలు

మార్కాపురం టౌన్/మార్కాపురం రూరల్/తర్లుపాడు/కొనకనమిట్ల/పొదిలి: మార్కాపురం నియోజకవర్గంలో పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గంలోని 289 పాఠశాలల్లో గురువారం ఎన్నికలు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే 13 పాఠశాలల్లో కోరం లేకపోవడం, టీడీపీ నేతల రాజకీయ ఒత్తిళ్లు తదితర కారణాలతో ఎన్నికలు నిలిపేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. మొత్తం 276 పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగా నూతన ఎస్ఎంసీ కమిటీలతో ప్రమాణం స్వీకారం చేయించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మార్కాపురం పట్టణ, రూరల్ మండలంలో 90 పాఠశాలలకుగాను 88 చోట్ల ఎన్నికలు నిర్వహించగా, కోరం లేకపోవడంతో బిరుదుల నరవ ప్రాథమిక పాఠశాల, పట్టణంలోని మదర్సా పాఠశాలలో ఎన్నికను వాయిదా వేసినట్లు ఎంఈఓ రాందాస్‌నాయక్ తెలిపారు. మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎన్నికలను డీవైఈఓ చంద్రమౌళీశ్వర్, పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు. కొండేపల్లి ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ మద్దతుదారులైన గంట ఆదినారాయణరెడ్డి చైర్మన్‌గా, మండ్ల కుమారిని వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని కుందురు పెద్ద వెంకటరెడ్డి, ఎంపీటీసీ కుందురు మల్లారెడ్డి, గాయం నాగేంద్రరెడ్డి, కొలగట్ల శివారెడ్డి, డాక్టర్ ఎల్.శేఖర్ అభినందించారు. కాగా గోగులదిన్నె ఎస్‌సి పాలెం పాఠశాలలో విద్యాకమిటీ ఛైర్మన్‌గా వైయస్సార్‌సీపీ మద్దతుదారుడు మురికిపూడి సుబ్బయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కొనకనమిట్ల మండలంలో 78 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 50 ప్రాథమిక, 4 యూపీ, 7 జెడ్పీ హైస్కూళ్లలో చైర్మన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 9 ప్రాథమిక పాఠశాలలు, ఒక జెడ్పీ పాఠశాలలో ఓటింగ్ నిర్వహించారు. వద్దిమడుగు, పేరారెడ్డిపల్లి, చేరెడ్డివారిపల్లి యూపీ పాఠశాలలు, చింతగుంట హిందూ, ఏఏ, నాగంపల్లి హెచ్‌డబ్ల్యూ, చౌటపల్లి ఏఏ పాఠశాలల్లో ఎన్నికలు కోరం లేక వాయిదా వేసినట్లు ఎంఈఓ ఎస్‌కే డాంగేషరీఫ్ తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎస్సై మాధవరావు పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

టీడీపీ నేతల ఒత్తిడితో నిలిచిన ఎన్నిక

పేరారెడ్డిపల్లి యూపీ పాఠశాల హెచ్ఎం ఓబులేషు తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటలకే 36 మంది సభ్యులు హాజరై ఏకగ్రీంగా సభ్యులను ఎన్నుకోవడానికి సిద్ధం కాగా హెచ్ఎం మాత్రం 12 గంటల వరకు ఎన్నిక నిర్వహించకుండా కోరం సరిపోదని చెప్పడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘నాదేమీ లేదు ఎంఈఓ వాయిదా వేయమన్నారు’ అని హెచ్ఎం చెప్పడాన్ని తప్పుబట్టారు. టీడీపీ నాయకుల ఒత్తిడితోనే కమిటీ ఎన్నిక వాయిదా వేశాడని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు.

పలు పాఠశాలల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల ఎన్నిక

పలు స్కూళ్ల ఎస్ఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. మండలంలోని చినారికట్ల జెడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన శిరుగూరి యాకోబు చైర్మన్‌గా వైస్ చైర్మన్‌గా మారావతు బాలనర్సయ్య, ప్రాథమిక పాఠశాలలో బరిగే ఆదిలక్ష్మి చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా తుమ్మ హసీనారెడ్డిని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, సర్పంచ్ అనురాధ, ఎంపీటీసీ ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ ఉడుముల గురవారెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ ఎన్నికలు ఏకగ్రీంగా నిర్వహించారు. అలాగే పాతపాడు హిందూ, నాగంపల్లి యూపీ, కాట్రగుంట, ఓబులరెడ్డిపల్లి పాఠశాలల కమిటీల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే ఎన్నికయ్యారు.

గిద్దలూరు రూరల్: మండలంలోని 89 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం విద్యాకమిటీ చైర్మన్ల ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించినట్లు ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు తెలిపారు. పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యం కలిగి ఉండే విద్యాకమిటీ చైర్మన్లు, వైస్‌చైర్మన్ల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించిన అనంతరం విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈఓ తెలిపారు.

కొమరోలు: మండలంలో ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు జరిగినట్లు మండల విద్యాశాఖాధికారి బొర్రా వెంకటరత్నం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 55 ప్రభుత్వ పాఠశాలలకు ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 4 పాఠశాలలకు కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయని, బాదినేనిపల్లె ఎంపీయూపీ పాఠశాల, యర్రగుంట్ల, అక్కపల్లె, మిట్టమీదిపల్లె ఎంపీపీ పాఠశాలల ఎన్నిక వాయిదా పడిందని, 51 పాఠశాలల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్‌తో ప్రమాణ స్వీకారం చేపించినట్లు తెలిపారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు పూర్తి

వెలిగండ్ల: మండలంలోని అన్ని పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం నిర్వహించారు. 58 ప్రాథమిక పాఠశాలలు, 2 ప్రాథమికోన్నత పాఠశాలలు, 5 హైస్కూల్స్, ఒక కస్తూర్బా పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు.

బేస్తవారిపేట: మండలంలోని 19 పంచాయతీల్లో ఎయిడెడ్ పాఠశాల ఒకటి, ప్రాథమిక పాఠశాలలు 48, ప్రాథమికోన్నత 6, ఉన్నత పాఠశాలలు 6 ఉన్నాయి. మండలంలోని జెడ్పీ హైస్కూల్ కొత్తపేట, ప్రాథమిక పాఠశాలలు ఖాజీపురం మెయిన్, బార్లకుంట, శింగసానిపల్లె, పందిళ్లపల్లెలో కోరం లేకపోవడంతో ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈఓ చేగిరెడ్డి రమణారెడ్డి తెలిపారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, మెంబర్స్‌తో హెచ్ఎంలు ప్రమాణ స్వీకారం చేయించారు.

కంభం: మండలంలో 45 పాఠశాలలు ఉండగా 44 పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు పూర్తయ్యాయి. యర్రబాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయి. పాఠశాలలో 170 మంది విద్యార్థులు ఉండగా 40 మంది తల్లిదండ్రులు మాత్రమే హాజరు కావడంతో ఎన్నికను వాయిదా వేస్తున్న ఉపాధ్యాయులు తెలిపారు. గతంలో కూడా ఈ పాఠశాలలో ఎన్నికలు 4 సార్లు వాయిదా పడి ఐదోసారి ఎన్నికలు నిర్వహించినట్లు స్థానికులు చెబుతున్నారు. యర్రబాలెంలో ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు అభ్యర్థులకు రెండు రెండు ఓట్లు రాగా చైర్మన్ పదవి కోసం ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గంటన్నర సేపు ఎన్నిక జరగకుండా ఆగిపోయింది. నలుగురు మెంబర్లలో ఒక మెంబర్ సంతకం పెట్టకుండానే అవతలి వారికి చైర్మన్ పదవి ఇచ్చేసారని స్థానిక సర్పంచ్ మద్దు శ్రీనివాస్ తెలిపారు. కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కంచి రామయ్య, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మాజీ, కందులాపురంలో రాజు ఎస్ఎంసీ చైర్మన్‌లుగా ఎంపికయ్యారు. పాఠశాలల వద్ద ఎస్సై పులి రాజేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అర్ధవీడు (బేస్తవారిపేట): మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరిగాయి. మండలంలో మొత్తం 48 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈఓ టి.సత్తార్ తెలిపారు. కోరం లేకపోవడంతో ఐదు పాఠశాలల్లో ఎన్నికలు జరుగలేదన్నారు. 43 పాఠశాలల్లో ఎన్నికైన పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లతో ప్రమాణస్వీకారం చేయించినట్లు పేర్కొన్నారు.

తర్లుపాడు: మండలంలో మొత్తం 51 పాఠశాలలు ఉండగా, 48 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. నాగెళ్లముడుపు బీసీ కాలనీ, ఫతేపురం, నాతనాంపల్లిలో ఎన్నికలు నిలిచాయి. ఎస్సై వేముల సుధాకర్ బందోబస్తును పర్యవేక్షించారు.


మార్కాపురంలో మాట్లాడుతున్న హెచ్ఎం చంద్రశేకర్‌రెడ్డి, పక్కన డీవైఈఓ


గొట్లగట్టు కేజీబీవీలో కమిటీ సభ్యుల ప్రమాణం


కంభం: యర్రబాలెం ప్రాథమిక పాఠశాల వద్ద గుమిగూడిన ప్రజలు



అర్ధవీడు జెడ్పీ హైస్కూల్లో ఎన్నికైన చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లతో ఎంఈఓ

ఎ1 గ్లోబల్ కాలేజీలో క్యాంపస్ సెలక్షన్స్


ప్లేస్‌మెంట్ ప్రతినిధులతో డాక్టర్ షంషేర్ ఆలీబేగ్, మసూద్ తదితరులు

మార్కాపురం: పట్టణంలోని ఎ1 గ్లోబల్ కళాశాలలో గురువారం ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీ బేగ్, డైరెక్టర్ మసూద్ ఆలీబేగ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్సెల్ ఆర్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్లేస్‌మెంట్లకు సంబంధించి విద్యార్థులకు అవగాహన, శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి జయవర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్, డాక్టర్ లత, సీఎస్ఈ హెచ్ఓడీ షేక్ మహమ్మద్ రఫీ, డీన్ శివకుమార్, మీరావలి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


డ్రైవర్లతో మాట్లాడుతున్న అధికారులు

గిద్దలూరు రూరల్: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆర్‌టీఓ అమర్‌నాయక్ అన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు గురువారం ట్రాఫిక్ రూల్స్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. వాహనాలు నడిపే వారికి ట్రాఫిక్ నిబంధనలు తెలిసి ఉండాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించరాదన్నారు. అతివేగంతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని గుర్తించాలన్నారు. ఎంవీఐ మాధవరావు, ఇన్‌చార్జి కమిషనర్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

కోలాహలంగా ప్రతిష్ఠ మహోత్సవాలు


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న కంకణదారులు

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలో పోలేరమ్మతల్లి, పోతురాజు స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం వేదపండితులు దక్షిణామూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కలశ స్థాపన, హోమాల్లో ఉభయదాతలుగా గ్రామస్తులు కంకణాలు ధరించి పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నాగులచవితి


పూజలు చేస్తున్న భక్తులు

గిద్దలూరు రూరల్: నాగులచవితి సందర్భంగా పట్టణంలోని రాజానగర్, నల్లబండ బజారులోని పుట్టల వద్ద భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. రేడియోబావి సమీపంలోని నాగమయ్య విగ్రహాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాలు పోసి భక్తిని చాటుకున్నారు. పసుపు, కుంకుమతో పుట్టల వద్ద మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు.

స్వాతంత్ర్య దిన వేడుకలకు దర్శి యువకుడు

దర్శి: నెహ్రూ కేంద్రం సంఘటన్ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ తరఫున కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 15న ఢిల్లీలో నిర్వహించే స్వాతంత్ర దిన సంబరాలకు వసంతపురం సాయి శ్రీ హరి ప్రవీణ్‌ను ఎంపిక చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం వివిధ జిల్లాల నుంచి కేవలం నలుగురిని మాత్రమే ఎంపిక చేయగా అందులో ప్రకాశం జిల్లా దర్శికి చెందిన ప్రవీణ్ ఒకరు. హరి నెహ్రూ యువ కేంద్రం, ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ద్వారా జరిగిన కార్యక్రమాల్లో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సామాజిక సేవల్లో, రాష్ట్ర, జాతీయ కార్యక్రమాల్లో క్రియాశీలక సభ్యుడిగా, మై భారత్, మేరీ మట్టి మేరీ దేశ్ లాంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనటం ద్వారా ఈ అవకాశం దక్కినట్లు తెలిపారు.

ఉచితంగా గడ్డిజొన్నల పంపిణీ

కురిచేడు: స్థానిక పశువైద్యశాలలో గురువారం పాడి రైతులకు గడ్డిజొన్నలను పశువైద్యాధికారి రమేష్ ఉచితంగా పంపిణీ చేశారు. మండలానికి 913 కిలోల గడ్డి జొన్నలు వచ్చినట్లు చెప్పారు. వాటిని పాడిరైతులు గ్రాసం పెంచుకునేందుకు అనువుగా ఒక్కో రైతుకి 3 కిలోల ప్రకారం ఉచితంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులను పిలిచి పంపిణీని ప్రారంభించారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి

పొదిలి: రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను ఈ-పంటలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని దర్శి ఏడీఏ బాలాజీ నాయక్ సూచించారు. క్షేత్ర పరిశీలనలో భాగంగా గురువారం వ్యవసాయాధికారి షేక్.జైనులాబ్దీన్‌తో కలిసి బుచ్చనపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో పర్యటించారు. పంట నమోదు పారదర్శకంగా ఉండాలని, రైతుల పేరున నమోదయ్యే వివరాలను క్షేత్ర స్థాయిలో కూడా సరిపోల్చుకోవాలని సిబ్బందికి సూచించారు. సెప్టెంబర్ 15వ తేదీ వరకు ఈ-క్రాప్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

కొనకనమిట్ల: రైతులు సాగు చేసిన పంటల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని వీఏఏలకు ఏఓ ప్రసన్న రంగలక్ష్మి సూచించారు. మండలంలోని మునగపాడు రైతు సేవా కేంద్రం పరిధిలో ఈ క్రాప్ నమోదు ప్రక్రియను రైతులు, వ్యవసాయ సహాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. కౌలు రైతులు కూడా గుర్తింపు కార్డులు చూపించి పంట నమోదు చేసుకోవాలని చెప్పారు.


సూచనలిస్తున్న అధికారులు

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కొమరోలు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కష్టాలు తీర్చాలంటూ హెచ్ఎం కాశయ్యకు తల్లిదండ్రులు గురువారం వినతిపత్రం అందజేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో పాల్గొనడానికి వచ్చిన తల్లిదండ్రులు పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానోపాధ్యాయునికి తెలిపారు. పాఠశాలలో రోజూ ఏర్పాటు చేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా, రుచికరంగా ఉండటం లేదని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు వినియోగిస్తున్న మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు బోధించడానికి లేరని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.


హెచ్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న తల్లిదండ్రులు

రోడ్డుపై వర్షం నీరు.. స్పందించండి సారూ..


రహదారిపై నిలిచిన వర్షం నీరు

కొనకనమిట్ల: వర్షం పడితే చాలు మండంలోని గొట్లగట్టు బస్టాండ్ సెంటర్లోని ఒంగోలు-గిద్దలూరు రహదారి స్పీడ్ బ్రేకర్ వద్ద వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేక కుంటను తలపిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికే స్పీడు బ్రేకర దగ్గర నీరు చేరి కుంటలా మారింది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రహదారి పక్కన మట్టి తీయించి రోడ్డుపై ఉన్న నీటిని బయటకు వెళ్లేలా చూడాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం


విరాళాన్ని హెచ్ఎంకు అందజేస్తున్న దాతలు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా గ్రామానికి చెందిన దొడ్డ సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ కందుల కళావతి చెరో రూ.10,075 చొప్పున మొత్తం రూ.20,150 అందజేశారు. విరాళాన్ని ఎమ్మెల్యే నారాయణరెడ్డి కుమారుడు విష్ణుర్రెడ్డి చేతులమీదుగా హెచ్ఎం సుధాకర్‌కు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను అభినందించారు.

అర్హులైన ప్రతి ఒక్క రైతుకు కౌలు కార్డు


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

కంభం: ఈ-పంట నమోదు రోజూ 20 ఎకరాల చొప్పున చేయాలని తహసీల్దార్ వి.కిరణ్, వ్యవసాయాధికారి డి.స్వరూప స్పష్టం చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయశాఖ, రెవెన్యూ సిబ్బందితో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కౌలురైతుల జాబితా సిద్ధం చేయాలన్నారు. మండలంలో 1023 కౌలు కార్డులకు 521 మత్రమే నమోదు చేశారని, మిగిలిన వారిని గుర్తించి త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించాలి

యర్రగొండపాలెం: గ్రామాల్లో ఉన్న కౌలు రైతులను వీఆర్వోలు, వీఏఏలు గుర్తించి కౌలు కార్డులు అందజేయాలని తహసీల్దార్ ఎం.హరిబాబు ఆదేశించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులకు కార్డులు అందజేస్తే వాస్తవ పొలం పట్టాదారుడికి ఎటువంటి నష్టం జరగదని, కౌలు రైతులకు ఆ పొలంలో పండించిన పంటపై మాత్రమే అధికారం ఉంటుందన్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. కౌలు కార్డులు ఉన్న రైతులకు పంట నమోదు, పంట నష్టపరిహారం, పంటల బీమా వర్తిస్తుందని చెప్పారు. సమావేశంలో ఏవో కేవీ శేషిరెడ్డి పాల్గొన్నారు.

దొనకొండ భూములను పరిశీలించిన జేసీ

దొనకొండ: దొనకొండ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కనిగిరి ఆర్‌డీఓ జాన్ నిర్వీన్‌తో కలిసి రుద్రసముద్రం భూములను పరిశీలించారు. ఆ ప్రాంతంలో గతంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్క్ పరిశీలించి ఎన్ని ఎకరాల్లో ఏర్పాటు చేశారని సంబంధిత రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ బి.రమాదేవి, డీఐఓ రాజేంద్రప్రసాద్, సర్వేయర్ దర్బార్ మస్తాన్‌వలి, లైసెన్స్ సర్వేయర్ వెంకట్రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.